
# కాలం తేనిది

శైలకుమార్



"నమస్కారం, సార్!"

అన్నాడు వినయంగా చేతులు జోడించి జనార్దన్. తలెత్తి చూసి "నువ్వా, రా" అంటూ సాదరంగా ఆహ్వానించాడు రాఘవ రావు. డెబ్భై ఏళ్ళ వృద్ధు డాయన. అనుభవ చిహ్నాల్లా ముడుతలు పడ్డ శరీరం. గతించిన గాంభీర్యపు సౌందర్యం కొట్టవచ్చేటట్లు కనిపిస్తున్న ముఖం. నవ్వును కనిపించీ కనిపించకుండా దాచే మీసాలు.

ఊరికి దూరంగా విశాలమైన తోట మధ్య నిర్మించిన పురాతన భవంతిలో దాదాపు ఏకాకి ఆయన. ఆ ఊరికి కొత్తగా టీచరుగా వచ్చాడు జనార్దన్. ఆ ఊరికి వచ్చే బస్సులో తన పక్కనే కూర్చోవటం వల్ల రాఘవరావుతో పరిచయం అయింది.

పాతికేళ్ళ జనార్దన్‌కు, డెబ్బైయి ఏళ్ళ రాఘవరావుకు మధ్య స్నేహానికి జ్ఞాన తృష్ణ వారధి. ఏమీ తోచని సాయం

త్రాలు ఆ వృద్ధుడిని కలిసి ఏదో ఒకటి మాట్లాడివెళ్ళటం జనార్దన్‌కు అలవాటు.

"ఆరోగ్యం ఎలా ఉందండీ?" అడిగాడు జనార్దన్ కుర్చీ లాక్కుని కూర్చుంటూ.

"వృద్ధుడి ఆరోగ్యం గురించి ఎందుకయ్యా ప్రశ్న? అది ఉండవలసింది నీ లాంటి యువకుడికి. ఇప్పట్లో ఏం భయం లేదులే" అన్నాడు నవ్వుతూ.

"మీరు ఎప్పుడూ ఏదో చిత్రంగానూ, ఏదో విషాదంగానూ మాట్లాడతారు."

"ప్రతి జీవితంలోనూ ఎక్కడో అంతర్గతంగా, అంతర్లీనంగా ఏదో విషాదం దాగే ఉంటుంది, బాబూ. ఒక్కోసారి అది భాషరూపంలోనో, లేక భావ రూపంలోనో వెలువడుతుంది" అన్నాడు నిట్టూర్చి చుట్ట వెలిగించుకుంటూ.

"జీవితంలో ఎక్కువ భాగం విషాదమేనంటారు!" అడిగాడు జనార్దన్.

"ఒక విధంగా అంతే."

"అసలు ఏది ఆనందం, ఏది విషాదం" అన్నాడు నవ్వుతూ జనార్దన్.

"దేనికీ సరిఅయిన నిర్వచనం లేదయ్యా. మనం అనుకోవడం లోనే ఉంది అంతా" అన్నారు ఆరిపోయిన చుట్ట వెలిగించుకుంటూ.

చలి గాలి వేయటంతో గుమ్మం కెదురుగా ఉన్న తన కుర్చీని పక్కకు లాక్కున్నాడు జనార్దన్. తల పైకెత్తాడు. ఎదురుగా అతన్ని ఎప్పుడూ సమస్యలో పడేసి ఆలోచించేట్లు చేస్తున్న తైలవర్ణ చిత్రం. చుట్టూ అమర్చిన గోల్డ్ ఫ్రేమ్ మధ్య వక్షం వరకూ ఉండి ఒయ్యారంగా చూస్తున్న పదహారేళ్ళ పసిడి వన్నెల పడుచు. జీవకళ ఉట్టి పడుతూంది చిత్రంలో. ఒత్తుగా ఉండి ఒంపులు తిరిగిన జుట్టు. తలార బోసుకుని భుజం మీదుగా ముందుకు పడి ఒక వక్షాన్ని కప్పుతూందది... నుదుటి మధ్య అర్ధచంద్రాకారపు కస్తూరి బొట్టు. విశాలంగా, అందంగా నిరంకుశాధికారిలా ఆజ్ఞాపించగల కళ్ళు. తీర్చి దిద్దినట్లు, ఎదుటి మనిషి హృదయం లోకి సూటిగా గ్రుచ్చుకునేటట్లు ఉన్న ముక్కు. నవ్వీ నవ్వక అందాన్నంతా బందీ చేసుకుని, లేత మందార వర్ణంతో దివ్యలోకపు మధువుల మధురత్వాన్నంతా నింపుకొని కవ్విస్తున్న పెదవులు. చిన్ని గడ్డం, దానిపై చిన్న పుట్టు మచ్చ.

అలాగే చూస్తూండి పోయాడు జనార్దన్ ఆ చిత్రాన్ని. ఎన్నో సార్లు చూశాడు ఆ ఇంటిలో ఆ చిత్రాన్ని అతడు. చూసిన ప్రతి సారీ మూర్తీభవించిన ఆ సౌందర్యరాశి ఎవరో తెలుసుకోవాలనుకునే వాడు. కాని ఎందుకో రాఘవ రావును అడగలేక పోయేవాడు. రాఘవ రావు ఆ చిత్రాన్నే తదేకంగా చూస్తూ ఈ లోకాన్నే మరచి పోవటంకూడా ఎన్నో సార్లు గమనించాడు.

"ఏమిటోయ్ ఆలోచనలో పడ్డావు?" చిన్నగా దగ్గుతూ అడిగాడు రాఘవరావు.

"ఏం లేదండీ."

"ఏమీ లేకుండా ఎలా ఉంటుంది?" నవ్వుతూ అన్నాడు.

"ఈ చిత్రం ఎవరిదో ఏమిటో మీకు అభ్యంతరం లేకపోతే తెలుసుకోవాలని ఉందండీ" అడిగాడు నిదానంగా జనార్దన్.

"నాకు తెలుసు—ఏదో ఒక రోజు నువ్వీ చిత్రాన్ని గురించి అడుగుతావని. ఆ చిత్రానికీ, నాకూ మాటల్లో నిర్వచించలేని, భాషలో చెప్పుకోలేని అనుబంధం ఉంది" అన్నారాయన చుట్ట నుసి రాలుస్తూ.

మౌనంగా వింటూఉన్నాడు జనార్దన్.

"ఆ చిత్రం వేసి ఎన్నాళ్ళయిందో చెప్పగలవా?" అడిగాడు నవ్వుతూ.

"బహుశా ఏ ఐదారు సంవత్సరాలో అయి ఉండవచ్చు." కుతూహలంగానే ఆయన వైపు చూస్తూ అన్నాడు జనార్దన్.

"చూశావా—అందర్లా నువ్వూ పొరబడ్డావు. అది వేసి సుమారు వంద సంవత్సరాలకు పైగా అయింది."

"నమ్మలేకుండా ఉన్నాను" అంటూ మళ్ళీ ఆ చిత్రం వైపు చూశాడు జనార్దన్.

"నమ్మలేని విషయాలు ఎన్నోఉన్నాయి దాని వెనుక."

"తెలుసుకోవాలని ఉందండీ" అన్నాడు కుర్చీ దగ్గరగా జరుపుకుంటూ.

"చెబుతాను. నా జీవితం లోకి విచిత్రంగా, వింతగా ప్రవేశించిన ఆ చిత్రాన్ని గురించి, ఆ మనిషిని నే చూడక పోయినా నా కేదో ఆత్మీయత గోచరించే ఆ రూపం గురించి చెబుతాను, విను" అంటూ చెప్పసాగాడు రాఘవరావు.

● ● ●


"రాధా, రాధా" అంటూ హడావుడిగా ఇంట్లోకి ప్రవేశించాడు రాఘవరావు.

"ఏమిటి" అంది ముద్దుగా రాగం తీస్తూ అక్కడే సోఫాలో కూర్చున్న రాధ.

"అరె, ఇక్కడే ఉన్నావా" అంటూ ఆమెపక్కనే కూర్చునిదగ్గరికిలాక్కుం టా "శ్రీపురంలో ఇల్లు కొనేశాను. ఎంత చవగ్గా వచ్చిందో తెలుసా" అన్నాడు.

"ఏదీ?—మొన్న మనం చూసిన ఆ పాత జమీందారీ బంగళాయేనా" అడిగింది రాధ అతని చేతులు విడిపించుకుంటూ.

"అవును" అన్నాడు ఆమెను మరింత దగ్గరకు లాక్కుంటూ.



"అబ్బ! వదలండి. తలుపు తెరిచే ఉంది."

"ఉంటే ఏం? తప్పా?"

"సిగ్గు లేకపోతేసరి" అంటూదూరంగా జరిగింది రాధ. బుంగమూతి పెట్టాడు రాఘవరావు.

"శ్రీపురంలో మనకు ఇల్లెందుకండీ? పైగా వూరికి దూరంగా" అని తన అనుమానం బయట పెట్టింది రాధ.

"ఎందుకేమిటి? హాయిగా ఇద్దరం ఏకాంతంగా గడపటానికి. ఆ చుట్టు పక్కల కొన్ని పొలాలు కొని అక్కడే సెటిల్ అవ్వాలని ఉంది."

"ఏం—అంతగానచ్చిందా ఆ వూరు!" చిలిపిగా అడిగింది రాధ.

"అవును, రాధా! ఆ వూరు, దాన్ని ఆనుకునే పారుతున్న ఆ కాలువ, భూమికి పచ్చని చీర కట్టినట్లు కనిపించే ఆ పొలాలు, సాయంకాలం పూట ఎరుపూ తెలుపూ రంగులు కలిసి సాగిపోయే ఆ మేఘాలు, ఆ చల్లటి గాలి, అడవి లాంటి చెట్ల మధ్య గతించిన వైభవానికి స్మృతి చిహ్నంగా మిగిలి నట్లున్న ఆ ఇల్లు, ఆ వెన్నెల..."

తన్మయత్వంతో చెప్పుకు పోతున్న అతన్ని అలాగే చూస్తూ ఉండిపోయింది రాధ.

"ఆ నిండు వెన్నెల్లో మేడపైన తెల్లని పరుపు పరిచి, దాన్నిండా మల్లెలు చల్లి, చల్లగాలి ఆ మల్లెల పరిమళాన్ని మనసులోని కోరికను పెంచుతూ ఉంటే, ఎవ్వరూ లేని ఏకాంతంలో, నిశ్శబ్దంలో తెల్ల చీరలో కలువ పువ్వుల కమ్మదనాన్నంతా కలబోసుకుని ఒయ్యారంగా పడుకున్న నీ ఒడిలో తల పెట్టి, నడుం చుట్టూ చెయ్యి చుట్టి దగ్గరికి లాక్కుంటూ, కళ్ళతో కవ్వించుకుంటూ ఆ రాత్రి జీవంతో ఉన్నది మన మిద్దరమేనని, వెన్నెల వానలో తడిసి, జీవితపు కాగితం మీద ముద్దుల భాషతో హద్దు లేని ఒద్దికల ఒంకారాన్ని రాసుకుని, విశ్వం లోని ఆనందాన్నంతా మల్లె పూలుగా చేసి తలలో పెట్టుకుని, పెదవులతో కాక స్పర్శా పారవశ్యంతో భావాలు చెప్పుకుని, అబ్బా...రాధా" అంటూ కౌగిలించుకున్నాడామెను.

"ఎంత కవిత్వం చెప్పారండీ" అని చిలిపిగా అతని బుగ్గలు రాసి విడిపించుకుంది.

"త్వరలోనే మనం శ్రీపురం వెళ్ళిపోతున్నాం రెడీగా ఉండు" అని ఇంట్లోకి వెళ్ళాడు రాఘవరావు.

వారం తిరిగే లోపునే శ్రీపురంలోని బంగళాలోకి చేరి పోయారు రాధా రాఘవరావులు. ఉదయనుంచే వూరిలోని



కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ బెంగుళూరు వారి ఒక నాణ్యమయిన ఉత్పాదన.
మార్కెట్ చేయువారు: మైసూరు సేల్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, బెంగుళూరు

MCA/SDP/102/TEL

పెద్దలు, స్నేహితులు అంతా వచ్చి పలకరించటం ప్రారంభించారు. అందరినీ సాదరంగా ఆహ్వానిస్తూ పలకరిస్తున్నాడు రాఘవరావు. ఒక వైపు వచ్చిన వారితో మాట్లాడుతూ, మరో వైపు ఇల్లంతా సర్దిస్తూంది రాధ.

సాయంత్రం అయింది. వచ్చిన వాళ్ళు ఒక్కొక్కరే వెళ్ళి పోతున్నారు. శాస్త్రి, డాక్టరు మిగిలారు. రాఘవరావు ఆత్మీయులు ఇద్దరూ. పామిస్ట్రీ, న్యూరాలజీ, సైకాలజీ, హిప్నటిజం మొదలైన వాటిలో ఆరి తేరిన దిట్ట డాక్టరు. శాస్త్రి కవి, అహంభావి. బలవంతంగా వాళ్ళను భోజనానికిఉంచాడు రాఘవరావు. భోజనాల తరవాత దాదాపు పదకొండు వరకూ మాట్లాడుతూ కూర్చున్నారు ముగ్గురూ. స్నానం చేసి మేడ పైన గదిలో పక్కలు వేయించింది రాధ.

"మరి వస్తాం" అన్నాడు డాక్టరు వెళ్ళడానికి లేచి. శాస్త్రీ లేచాడు.

"రేపు కలుస్తారుగా!"

"అలాగే. విష్ యూ హేపీ లైవ్" అన్నాడు డాక్టరు.

"థాంక్స్" అంటూ వాకిలి దాకా వెళ్ళి వచ్చాడు రాఘవరావు.

అప్పటిదాకా వాళ్ళెప్పుడు వెళతారా అని కాచుక్కూచున్న రాధ "హమ్మయ్య, ఇప్పటికి పూర్తయిందన్న మాట" అంటూ ఎదురొచ్చింది.

"మొదటిరోజు కదోయ్— అందుకే ఈ హడావిడి."

ఇద్దరూ చెక్కమెట్లపై నుంచి నడుస్తూ మేడ పై గదిలోకి వచ్చారు.

"ముందీ మెట్లు మార్పించాలండీ! పెద్ద శబ్దం చేస్తున్నాయి" అంది రాధ.

"అలాగే" అంటూ పక్కపై వాలి పోయాడు రాఘవరావు.

అప్పటిదాకా శబ్దంతో గలగలలాడిన ఆ ఇంట్లో అందరూ వెళ్ళిపోవటంతో నిశ్శబ్దం ఆవరించింది.

తెల్లని దుప్పటి పరిచిన పరుపుమధ్య లుంగీతో కూర్చుని "రాధా" అని పిలిచాడు.

"ఊఁ" అంది.

"ఇలా రా."

"ఎందుకూ?" గోముగా అడిగింది.

"అబ్బ! రమ్మంటుంటే..."

"ఎందుకంటుంటే..." సాగదీసింది.

"ఊరికేనేలేవోయ్. ఇలాదగ్గరగా రా." ఆమె నడుం చుట్టూ చెయ్యి వేసి దగ్గరికి లాక్కుంటూ అన్నాడు.

"ఊరికేనే ఎందుకు" చిలిపిగా అంటూనే అతనికి దగ్గరగా జరిగింది. ఆమెను మరింత దగ్గరగా లాక్కున్నాడు. చూపుడువేలుతో లైటు చూపించింది. ఆర్పేశాడు. గదిలో చిరు దీపపు కాంతి. కిటికీ గుండా మంచం పక్కగా పడుతున్న లేత వెన్నెల. రాధ మొహాన్ని రెండు చేతులతో దగ్గరగా తీసుకుని, కళ్ళలో కళ్ళు పెట్టి అలాగే చూడసాగాడు రాఘవరావు. ఏ శబ్దమూ లేని నిశ్శబ్దం ఆవరించింది ఆ ప్రదేశమంతా. వాళ్ళ ఊపిరి శబ్దంతప్ప మరేమీ విన్పించటం లేదు. మరింత దగ్గరకు జరిగింది రాధ. భాష కందని భావాలు మాట్లాడుకుంటున్న కళ్ళతో, రెండు చేతులతో రాఘవరావు బుగ్గలు నిమురుతూ, పెదవులపై గాడంగా చుంబించింది రాధ. ఆ పారవశ్యం ఏకమైన హృదయాల లోతుల్లో ఎక్కడో ఆనందంతో మూర్ఛిల్లిన తీయని వీణా నిక్వణ రహస్యం.

"మవునం దాల్చావేం?"

"మనసుకు మాటలు రావండీ. అనుభూతి భాష కందదు."

ఇద్దరూ మరింత దగ్గరయ్యారు. ఇంతలో లీలగా ఏదో అడుగుల చప్పుడు. ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ దగ్గరవుతున్నట్లు అడుగుల చప్పుడు. ఉలిక్కిపడింది రాధ.

"కింద ఏదో చప్పుడు వినిపిస్తూందండీ." సాధ్యమైనంత మెల్లగా చెప్పింది. అంతిమ ఘడియకు చేరుకోబోతున్న ఆనందపు తపస్సు భగ్నమైనట్లు అనిపించింది రాఘవరావుకు.

"ఎలుకలో, పిల్లో అయి ఉంటుంది."

భయం భయంగా అతని గుండెపైకి ఒదిగింది రాధ. అడుగుల చప్పుడు మరింత దగ్గరయింది. టక్, టక్ అని చెక్కమెట్లు ఒక్కొక్కటి ఎక్కుతున్న శబ్దం. వణికి పోసాగింది రాధ.

"మనిషి అడుగుల చప్పుడులా ఉందండి. దొంగాడేమో" అంది.

చెవులు రిక్కించి విన్న రాఘవరావుకూ అనుమానం వచ్చింది. వారిద్దరిలోనూ ఆనందం స్థానే లీలగా భయం ప్రవేశిస్తూంది.

ఆ నిశ్శబ్దంలో లయబద్ధంగా ఉంది అడుగుల చప్పుడు. భయం కలిగిస్తూ ఉంది. నిదానంగా మెట్లు ఎక్కి వస్తున్నట్లు ఉంది. ఒకరి మొహం ఒకరు చూసుకుంటూ మవునంగా ఉన్నారు ఇద్దరూ. అంత చలిలోనూ రాధకు చెమటలు పట్టడం ప్రారంభించాయి.

ధైర్యం చెబుతున్నట్లు మెల్లగా ఆమె వీపు నిమిరాడు రాఘవరావు. అడుగుల చప్పుడు మరింత దగ్గరై

తలుపు దగ్గరికి వచ్చి ఆగిపోయింది.

పక్కపై నుంచి పైకి లేచాడు రాఘవరావు. వద్దన్నట్లు అతని చెయ్యి పట్టుకుంది రాధ. భయం లేదన్నట్లు ఆమె భుజం తట్టి మంచం దిగాడు. ఆమె కూడా అతని వెనకే దిగింది.

"ఎవరది?" గట్టిగా పిలిచాడు రాఘవరావు.

సమాధానం లేదు.

"ఎవరది? పిలుస్తుంటే వినపట్టం లేదూ?" మరి కాస్త గట్టిగా అన్నాడు. సమాధానం రాలేదు. రాధ దగ్గరగా వచ్చి అతని భుజాన్ని ఆనుకుంది.

పక్కనే ఉన్న కర్ర తీసుకుని, ధైర్యాన్ని కూడగట్టుకుని, బయటికి రావద్దు అని రాధకు చెప్పి టక్కున తలుపు తెరిచాడు. ఎవ్వరూ లేరు. చిరుచీకటిగా ఉంది.

"ఎవరది? ఎందుకొచ్చారు" అంటూ గది బయటికి అడుగు పెట్టాడు. ఉన్నట్టుండి మనిషి పక్క నుంచి పరుగెత్తుతూ మెట్లు దిగుతున్న చప్పుడు. వడివడిగా రాఘవరావు అనుసరించాడు. మెట్లు దిగి లైటు వేశాడు. ఎవ్వరూ లేరు. వేసిన తలుపులు వేసినట్లే ఉన్నాయి. ఆకారం కనిపించని అడుగుల చప్పుడు. ఆశ్చర్యపోయాడు ఒక్క క్షణం. మళ్ళీ భయం ప్రవేశించింది. తను భ్రమ పడలేదు కదా అనుకున్నాడు. తనే ఇలా ఉంటే, రాధ ఇంకెంత భయపడుతుందోఅనుకుని వెనక్కి తిరిగాడు. మళ్ళీ అడుగుల చప్పుడు. తిరిగి చూశాడు. ఎవరూ లేరు. మేడ పైకి వెళ్ళాడు. ఒళ్ళంతా చెమటలు పట్టి అచేతనంగా చూస్తూ ఉంది రాధ. దగ్గరికి వెళ్ళాడు. చటుక్కున కౌగిలించుకుంది.

"ఏం లేదులే—భయపడకు" అన్నాడు ఆమె ముఖం తుడుస్తూ.

"ఇదేదో దయ్యం బంగళాలా ఉంది. అందుకే చవగ్గా ఇచ్చారు" అంది భయం భయంగా.

"పిచ్చిదానా! అదేం కాదులే నిద్రపో" అంటూ పక్కపైకి వాలాడు. ఏ ఉద్రేకమూ లేని కౌగిలిలో ఇద్దరూ. పడుకున్నాడే గాని ఆ అడుగుల చప్పుడు గురించి, శబ్దరూపంతో ఆకారం లేకుండా తన ముందు నుంచే పారిపోయిన దాన్ని గురించి ఆలోచించసాగాడు రాఘవరావు.

తెల్లారిపోయింది ఆలోచనలతో.

నిద్రలేస్తూనే మొదటి మాటగా "ఈ ఇల్లు మన కొద్దండీ" అంది రాధ.

"ఆలోచిద్దాం — తొందరపడకు" అన్నాడు.

ఉదయం పది గంటలకు శాస్త్రి, డాక్టరు వచ్చారు. పలకరింపులు, కాఫీలు అయిన తరవాత రాత్రి జరిగిన విషయాలన్నీ వివరంగా చెప్పాడు రాఘవరావు.

చాలా సేపు మవునంగా ఆలోచించాడు డాక్టరు.

"ఇదేదో దయ్యం అనిపిస్తూంది" అన్నాడు శాస్త్రి.

"దయ్యమూ, దేవుడూ అని దానికి ఏ పేరూ పెట్టవద్దు. ప్రస్తుతానికి ఒక శక్తి అనుకుందాం" అని రాఘవరావు వైపు తిరిగి, "రాఘవా! నువ్వు పర్మిట్ చేస్తే ఆ శక్తిని ఈ రాత్రికి పిలిచి దాని విషయాలు తెలుసుకుందాం" అన్నాడు డాక్టరు.

"శక్తిని పిలిచి విషయాలు తెలుసుకుంటావా? ఎలా?" అడిగాడు కుతూహలంగా రాఘవరావు.

"చెబుతాను, అయితే నేను చెప్పినట్లు వినాలి."

"అలాగే. కాని ఇలాంటివి సాధ్యం అంటావా?"

"తప్పకుండా సాధ్యమే. అయితే నమ్మకం ఉండాలి. ఇంతకుముందు మన పూర్వులు చేసేవారు—నేను చూపిస్తాగా!" అన్నాడు డాక్టరు.

"అలాగే—మీ ఇష్టం." ఒప్పుకున్నాడు రాఘవరావు.

"అయితే రాత్రికి ఈ గదిని శుభ్రంగా ఉంచండి. ఇక్కడ చూస్తూ కూర్చున్న అందరూ ఏం జరుగుతున్నా నిశ్శబ్దంగా ఉండాలి. ఎవ్వరికీ ఏ అపాయమూ ఉండదని నేను హామీ ఇస్తాను. పిన్‌డ్రాప్ సైలెన్స్‌గా ఉండాలి అందరూ. ఒక మూడు కాళ్ళ పీట కావాలి. సరిగ్గా రాత్రి పదికి ప్రారంభిద్దాం. ఏమంటారు?" అడిగాడు డాక్టరు.

"అలాగే" అని ఒప్పుకున్నారు అందరూ.

సరిగ్గా రాత్రి పది గంటలకే వచ్చాడు డాక్టరు. చేతిలో ఒక పెద్ద చార్టు—దానిలో ఒక వైపు అంకెలు, ఒక వైపు వరుసగా అక్షరాలు. తలుపులు మూసి గదిని పరిశీలించాడు. గది మధ్య మూడుకాళ్ళ పీట.

"రండి."

అందర్నీ పిలిచి చార్టు పరచి దాని చుట్టూ నలుగురూ కూర్చునేలా చేశాడు. తనూ కూర్చున్నాడు. కొద్ది దూరంలో ముక్కాలిపీట ఉంచాడు. ఆశ్చర్యంగా చూస్తున్నారు శాస్త్రి, రాఘవరావు, రాధ. ఒక చిన్న గుండ్రటి గాజుబిళ్ళ చార్టు మధ్యభాగంలో ఉంచాడు.

"నేను చెప్పినప్పుడు మీరు ముగ్గురూ ఒక్కో వేలును తాకీ తాకనట్లుగా ఈ గాజుబిళ్ళపై ఉంచండి. అది కదులుతుంది. అది ఏ దిశలో కదిలి ఏ అక్షరం దగ్గరికి వెళ్ళినా దాన్ని నోట్ చేసుకోండి. మీరుగా దాన్ని కదిలించటానికి ప్రయత్నించవద్దు" అని అందరికీ చెప్పాడు డాక్టరు.

అలాగే అన్నట్లు అందరూ తలలు వూపారు.

"మరి కొద్ది సేపట్లో ఆ ఆత్మను పిలుస్తాను. ముక్కాలిపీట ఒకసారి శబ్దంచేస్తే అవునని, రెండుసార్లు శబ్దం చేస్తే కాదని అనుకుని మనం దీన్ని ప్రశ్నిద్దాం. అందరూ నిశ్శబ్దంగా ఉండండి" అంటూ ప్రారంభించాడు.

అందరూ ఆసక్తిగా అతన్నే చూస్తున్నారు. ఆ ప్రాంత మంతా నిశ్శబ్దం ఆవరించింది. నడుస్తున్న చీమ కాళ్ళ అడుగుల చప్పుడు వినిపించేంత నిశ్శబ్దం. బల్లి నోటిలో చిక్కిన పురుగు చేసే ఆఖరి ఆక్రందన వినిపించేంత నిశ్శబ్దం.

తపస్సమాధిలోకి వెళ్ళినట్లు కనిపిస్తున్నాడు డాక్టరు. ఏదో తనలో తాను మాట్లాడుకుంటున్నట్లు పెదవులు కదిలిస్తున్నాడు. కాసేపటి తర్వాత "నువ్వు ఆత్మవా" అని గుసగుసలాడినట్లు ప్రశ్నించాడు డాక్టరు. 'అవును' అన్నట్లు ఒకసారి శబ్దం చేసింది ముక్కాలిపీట.

"ఈ ఇంటిలో తిరుగుతున్నావు కదూ?" మళ్ళీ ప్రశ్న.

'టక్' అని ఒకసారి శబ్దం చేసింది పీట.

ఆశ్చర్యంతో ఆ పీటనే చూస్తున్నారు మిగిలిన ముగ్గురూ. గాజుబిళ్ళపై వేళ్ళుంచమని సైగ చేశాడు డాక్టరు. అందరూ అలాగే చేశారు.

"నీ పేరు?" ప్రశ్నించాడు డాక్టరు. మెల్లగా గాజుబిళ్ళ కదిలి అక్షరాల వైపు వెళ్ళటం ప్రారంభించింది. అక్షరాలను కలిపి చదువుకోసాగారు అందరూ.

"ఆకారానికే తప్ప ఆత్మకు పేరు లేదు."

"ఇక్కడ ఎందుకు తిరుగుతున్నావు?" డాక్టరు.

"ఇది నా ఇల్లు!" అక్షరాల పైకి కదిలిన గాజు పలక నుండి సమాధానం.

'ఎప్పట్నొ?"

"ఏభై ఏళ్ళ క్రిందట."



''రాఘవ కొనుక్కున్నాడుగా మరి!'' సౌమ్యంగా చెప్పాడు డాక్టరు.

''అదంతా నాకు తెలియదు.''

''వీళ్ళిక్కడ ఉండటం నీ కిష్టం లేదా?''

లేదు.''

''వీళ్ళ కేదైనా హాని చేస్తావా?''

''లేదు.''

చాలాసేపు మౌనంగా ఉండి మళ్ళీ పేరడిగాడు డాక్టరు. సమాధానం రాలేదు. ''మీ వూరు?'' అన్నాడు. సమాధానం రాలేదు.

''నీ గురించి చెప్పుకోవటం ఇష్టం లేదా?'' అడిగాడు డాక్టరు.

''లేదు.''

''అయితే వీళ్ళిక్కడి నుండి వెళ్ళి పోవాలంటావా?''

''అవును.''

ఆ తరవాత ఏ ప్రశ్నకూ సమాధానం రాలేదు. అయిపోయింది అన్నట్లు పైకి లేచాడు డాక్టరు. ''విన్నారుగా'' అన్నాడు.

అందరూ బరువుగా వూపిరి పీల్చు కుని 'విన్నాం' అన్నట్లు తలలు వూపారు.

''అయితే ఈ ఇల్లు మేం వదలి వెళ్ళవలసిందేనా? ఇంతడబ్బూ వృథా అయిన ట్లేనా?'' అడిగింది రాధ బాధగా.

''ఆలోచిద్దాం ఉండమ్మా'' అన్నాడు డాక్టరు.

''ఇంతకూ ఏమిటండీ ఇది?'' అడిగాడు రాఘవరావు.

''ఏముంది? ఈ ఇల్లు ఆ ఆత్మకు సంబంధించినది. ఇంటికీ, ఆత్మకూ ఏదో అనుబంధం ఉంది. ఇక్కడ ఎవ్వరూ ఉండటం దానికి ఇష్టంలేదు. హాని చెయ్యను అని చెప్పింది కాబట్టి కొంత కాలం వరకు మనకు భయం లేదు'' అన్నాడు డాక్టరు.

అందరూ మౌనంగా ఉన్నారు.

''రాఘవరావుగారూ! మీరు రేపు రిజిస్ట్రారు ఆఫీసుకెళ్ళి యాభయి ఏళ్ళ క్రిందట ఈ ఇల్లు ఎవరిదో ఏమిటో, వీలైతే ఆ మనిషి జీవిత వివరాలు తెలుసుకుని రండి. శాస్త్రి వూరులో కెళ్ళి ఎవరైనా ఈ ఇల్లు గురించి తెలిసిన వృద్ధుల్ని కలిసి మాట్లాడి కొన్ని వివరాలు తెలుసుకుంటారు. తెలిసినదాన్ని బట్టి ఏం చెయ్యాలన్నది నిర్ణయిద్దాం'' అన్నాడు మళ్ళీ డాక్టరు.

''అంతవరకూ ఈ ఇంటిలో ఎలా ఉండాలండీ?'' అంది భయంగా రాధ.

''సాధారణంగా ఆత్మలు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటా యమ్మా. హాని చెయ్యను అన్నది కాబట్టి మీకేం భయం లేదు. అది ఏం చేస్తున్నా చూస్తూ వూరుకోండి. అంతే.'' సమాధానం ఇచ్చాడు డాక్టరు.

''మళ్ళీ రేపు సాయంత్రం కలుద్దాం. ఈ లోపల మీరు వివరాలు సేకరించండి'' అని చెప్పి వెళ్ళిపోయాడు డాక్టరు. శాస్త్రి కూడా వెళ్ళిపోయాడు.

ఆ రాత్రంతా భయం భయంగానే గడిపారు రాధా రాఘవరావులు. ఆ రాత్రి ఏమీ వినిపించలేదు. తెల్లవారి రాధకు ధైర్యం చెప్పి వెళ్ళాడు రాఘవరావు.

సాయంత్రం ఆరు గంటల కల్లా తిరిగి వచ్చాడు రాఘవరావు. అప్పటికే శాస్త్రి, డాక్టరు వచ్చి ఉన్నారు. తను తెలుసుకుని వచ్చిన విషయాలు చెప్ప సాగాడు రాఘవరావు.

''యాభై ఏళ్ళ క్రితం సింహ ప్రసాద్ అన్న వ్యక్తిది ఈ ఇల్లు. చితికి పోయిన జమీందారీ వంశంలో చివర వాడు అతను. విచ్చలవిడిగా ఖర్చు చేసేవాడు. ఏదో నేరం చేసి జైలుకు వెళ్ళటంతో అతని వారసులని చెప్పుకునే వాళ్ళు దీన్ని అమ్మేశారు. అది చేతులు మారుతూ చివరికి నా దగ్గర కొచ్చింది'' అన్నాడు రాఘవరావు.

''ఇంతేనా?'' అడిగాడు డాక్టరు.

''ఇంతకు మించిన వివరాలు తెలియ లేదు.'' రాఘవరావు.

''మిగిలి ది నే చెబుతాను—వినండి'' అంటూ ప్రారంభించాడు శాస్త్రి.

''సింహప్రసాద్ చాలా అందగాడు. పేద ఇంటి నుంచి వచ్చిన విజయ అనే అమ్మాయిని ప్రేమించాడు. అందర్నీ కాదని ఆమెనే కోరి కోరి పెళ్ళి చేసు కున్నాడు. ఆమెకూడా చాలా సౌందర్య రాశి. అయితే ఏం జరిగిందో కాని పెళ్ళయి సంవత్సరం నిండక ముందే ఆమెను హత్య చేసి ఈ తోటలోనే ఎక్కడో పాతి పెట్టాడు. ఆ తరవాత శవం బయట పడింది. నేరం రుజువై ఆయ నను ఉరి తీశారు.'' ముగించాడు శాస్త్రి.

''ఎందుకు చంపాడో తెలుసా?'' అడిగాడు డాక్టరు.

''ఆ వివరాలు తెలియవు'' అన్నాడు శాస్త్రి.

''ఇదంతా వింటుంటే ఆశ్చర్యంగా లేదూ!'' అంది రాధ రాఘవరావుతో.



అవునన్నట్లు తల వూపి "ఏం చేద్దామంటారు, డాక్టర్?" అడిగాడు రాఘవరావు.

"సింహప్రసాద్ ఆత్మ ఆత్మీయతకు సంబంధించిన దేదో ఇక్కడ ఉంది. అందుకే అత డిక్కడే తిరుగుతూ ఎవ్వర్నీ ఉండకుండా చేస్తున్నాడు. ఒక విధంగా ఖాళీ చెయ్యటమే మంచిదేమో" అన్నాడు డాక్టరు.

"ఇంత డబ్బు దీని మీద పోసి..." రాఘవరావులో డబ్బు వృధా అయిందన్న బాధ.

"నిజమే చూద్దాం. ఈ రాత్రికి మళ్ళీ దాన్ని పిలవటానికి ప్రయత్నిద్దాం" అన్నాడు డాక్టరు.

భోజనాలు పూర్తయ్యాక అందరూ మునపటిలా కలిసి కూర్చున్నారు పీట, చార్టు ముందు పెట్టుకుని.

"మీరు సింహప్రసాద్ కదూ!" డాక్టరు.

"టక్" మని శబ్దం చేసింది పీట అవునన్నట్లు.

"మీ గురించి తెలుసుకున్నందుకు కోపంగా ఉందా?" డాక్టరు.

రెండు సార్లు శబ్దం చేసింది పీట 'లేదు' అన్నట్లు.

"కనీసం కొద్ది రోజులు ఉండటానికి ఒప్పుకుంటారా?"

ఒకసారి శబ్దం—ఒప్పుకున్నట్లు.

"మా కేమీ హాని లేదుగా?"

లేదన్నట్లు రెండు సార్లు శబ్దం.

ఆ తరవాత అతని జీవితం గురించి అడిగిన ఏ ప్రశ్నకూ సమాధానం రాలేదు.

తలుపు దగ్గరగా వెళ్ళిపోతున్నట్లు అడుగుల శబ్దం వినిపించింది.

"కొంత కాలం వరకూ మీ కేం భయం లేదు. హాయిగా ఉండండి. తరవాత ఏం చెయ్యాలో చూద్దాం" అని సలహా ఇచ్చాడు డాక్టరు.

నాలుగు రోజులు గడిచి పోయాయి. ఇల్లంతా నిశ్శబ్దంగానే ఉంది. ఒక్క రోజు మాత్రం అడుగుల శబ్దం వినిపించి వెళ్ళిపోయింది రాధా రాఘవరావుల్లో చాలా భాగం భయం తగ్గింది.

అయిదవ రోజు రాత్రి పదకొండు గంటలు దాటింది. అడుగుల చప్పుడు ప్రారంభమైంది! మెట్ల పై నుంచి వచ్చి వాకిలి దగ్గర ఆగాయి అడుగులు,

"టక్ టక్." తలుపు చప్పుడయింది. మౌనంగా కూర్చున్నారు ఇద్దరూ, కౌగిలి నుంచి విడివడి. డ్రెస్సింగ్ టేబులు మీద డాక్టరు వదిలి వెళ్ళిన చార్టు గాలి వీస్తే కదిలినట్లు కదిలింది. ఏదో అర్థమైనట్లు రాఘవరావు. "ఏమైనా చెప్పాలనుకుంటున్నారా" అని అడిగాడు.

'టక్' అంది అవును అన్నట్లు. లేచి చార్టు తీసి రాధా, తనూ వేళ్ళు ఉంచారు గాజు బిళ్ళపై. కదల సాగిం దది.

"మీ రిక్కడనుంచి వెళ్ళద్దు."

ఆశ్చర్యపోయారు ఇద్దరూ. 'వెళ్ళి పొమ్మన్నారుగా!" మెల్లగా అడిగాడు.

"వద్దు."

"ఎందుకు?" రాఘవరావు.

"మీ రంటే నా కిష్టం. ఇంతవరకూ నా గురించి ఎవ్వరూ చూపని శ్రద్ధ మీరు చూపారు. అందుకే వెళ్ళద్దు. కాని నా కో సహాయం చెయ్యండి."

"ఏమిటి?" అడిగాడు రాఘవరావు.

"నేను మీ కో చిత్రాన్ని ఇస్తాను. దాన్ని మీదగ్గర జాగ్రత్తగా ఉంచండి. నేను కావాలని కోరుకుని చేసుకున్న స్త్రీ మూర్తి దా చిత్రం. పెల్లుబికిన ఆవేశంలో, పట్టలేని ఉద్రేకంలో ఆమెను హత్య చేశాను. కాని ఆ తరవాతే తెలిసింది ఆమె నెంత గాఢంగా, బలీయంగా ప్రేమించానో నేను—ఆమెను మరచి పోలేక, చేసిన నేరం మనసును రంపపు కోత కోస్తూ ఉంటే సహించలేక పోలీసులకు లొంగి ఉరి శిక్షకు గురయ్యాను. శిక్ష పొందే ముందు ఆమె జ్ఞాపక చిహ్నంగా నేను చిత్రించుకున్న చిత్రమే అది. ఎక్కడో మూలలో ధూళిలో పడి ఉంది. మీ కిస్తాను. దానికి వెలుగివ్వండి."

"ఎందు కామెను చంపారు?" అడిగాడు రాఘవరావు.

"మరొకరితో అక్రమ సంబంధం కలిగి ఉండటం కళ్ళారా చూసి ఆ ఆవేశంలో..."

"ఆ చిత్రాన్ని చూడటానికి మీరు మాటి మాటికి మా దగ్గర కొస్తారేమో!" అనుమానం బయట పెట్టాడు రాఘవరావు.

"రాను. అచిత్రం వెలుగు చూడటం, క్షేమంగా ఉండటమే నాక్కావాలి. చిత్రం వెలుగు చూసిందనే తృప్తితో దూరంగా వెళ్ళిపోతాను."

"అలాగే" అన్నాడు రాఘవరావు.

"నా వెనకే రండి." నడుస్తున్న అడుగుల చప్పుడు. ఆ చప్పుడు వెనకే వెళ్ళసాగాడు రాఘవరావు. ఆ ఇంటికి మూలగా స్టోరు రూములో పడి ఉన్న గదిలోకి వెళ్ళాయి అడుగులు. అనుసరించాడు రాఘవరావు. కొద్ది సేపటికి గదికి మూలగా నేలపై పరచిన బండ మీద 'టక్, టక్' అని శబ్దం వినిపించింది. మొదట అర్థం కాలేదు రాఘవరావుకు. మళ్ళీ 'టక్, టక్' అని అక్కడే శబ్దం వినిపించింది. ఆ రాయిని పరిశీలనగా చూసి మెల్లగా పైకి లేపాడు. అంత పెద్ద రాయీ తేలిగ్గా లేచింది. క్రిందికి మెట్లు ఉన్నాయి. అడుగుల చప్పుడు ఆ మెట్లపై నుంచి క్రిందికి దిగింది. బాటరీ వెలిగించి తనూ దిగాడు రాఘవరావు. గది అంతా బూజుతో, దుమ్ముతో, ధూళితో అసహ్యంగా ఉంది. బాటరీ వేసి చుట్టూ చూశాడు. బూజు వెనక గోడకు వేలాడుతూం దో చిత్రం. 'టక్, టక్' అని చప్పుడయింది దానిపై. చిత్రాన్ని తీసుకుని వచ్చేశాడు రాఘవరావు.

● ● ●

"నమ్మలేకుండా ఉన్నానండీ" అన్నాడు ఆశ్చర్యంగా జనార్దన్.

"కొన్ని అనుభవాలు అంతే—వ్యక్తిగతాలు. నా జీవితంలో జరిగి ఉండకపోతే నేనూ నమ్మేవాడిని కాదేమో!" ఆ చిత్రాన్ని చూస్తూ నిట్టూరుస్తూ అన్నాడు రాఘవరావు.

"మళ్ళీ ఆ ఆత్మ మీ దగ్గిరికి రాలేదా?" జనార్దన్. రాలేదన్నట్లు తల వూపి "పశ్చాత్తాపంతో గీసిన ఆమె చిత్రం ఆ మూల ధూళిలో పడి ఉండటం సహించలేకపోయాడు. దాని జాగ్రత్త కోసం అన్నాళ్ళూ కాపలా కాశాడు. అది వెలుగు చూసి క్షేమంగా ఉందన్న తృప్తితో వెళ్ళిపోయాడు. ఎంతగా ప్రేమించాడో ఆమెను, పాపం!" మళ్ళీ నిట్టూర్చాడు రాఘవరావు.

ఆ చిత్రాన్ని అలాగే చూస్తూ ఉండి పోయాడు జనార్దన్. ★

